# పగటి కలలు

## 5

క్రిటికీలోంచి సూర్యుడు తన 'వెయ్యి చేతులు' చాచి తట్టి లేపకపోతే ప్రకాశం అప్పుడే లేవకపోను. సాధారణంగా ప్రకాశం తనంతట తానుగా లేవనప్పుడు ఒళ్ళంతా బరువుగానూ, బద్ధకంగానూ ఉన్నట్టుంటుంది. కాని ఇవాళ ప్రకాశానికి చాలా హాయిగా ఉంది. ఒళ్ళు మహా తేలిగ్గా, గాలిలో తేలిపోయే బుల్లి ఈకలా ఉంది. కారణం: పరీక్ష లయిపోయాయి. దిక్కుమాలిన పరీక్షలు గడిచిన పది రోజులూ అవే లేపాయి. తన్ని మరీ లేపాయి. "ఇంకాస్సేపు- ఒక్క ఆయిదు నిమిషాలు - నిద్రపోనీ! లేస్తాగా!" అని పరీక్షలతో ప్రాధేయపడ్డాడు ప్రకాశం. కాని పరీక్షలకు దయాదాక్షిణ్యా లెక్కడివి?

కాకపోయినా ఈ ప్రపంచంలో దయాదాక్షిణ్యాలున్న వాళ్ళని ఎవరూ ఖాతరు చెయ్యరు. రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ళ మీద నడుస్తుంది. విద్యార్థులను తమ బిడ్డలల్లే చూసుకునే మేస్టర్ల చెవులకే పిల్లలు పిడకలు కట్టేసి, నానా అల్లరీ చేస్తారు. ఆడవాళ్ళకు అంతరంగం ఉండటంచేతనేగదా మగవాళ్ళు వాళ్ళని దిష్టి బొమ్మలు చేసి ఆడిస్తున్నారు? ప్రకాశాన్ని అమ్మ రోజూ ఆరు గంటలకు లేపేది. ప్రకాశం ఏనాడూ ఏడుకుముందు లేవలేదు. ఎంచాతా? అమ్మేగనక: 'పోనీ, పాపం, బడలిక ఇంకా తీరలేదుగామాలు! రోజల్లా చదువుతోనూ, ఆటలతోనూ సతమతమవుతాడాయె!' అని అమ్మ అనుకుంటుందని ప్రకాశానికి తెలుసు గనక!

అదే పరీక్షలువచ్చి గొంతుమీద కూర్చునేసరికి ప్రకాశం ఆటలు కట్టాయీ లేదా? వాడు రోజూ నాలుగున్నరకల్లా లేచి చన్నీళ్ళతో మొహం కడుక్కుని నిద్రమత్తు వదిలించుకుని పుస్తకాలు పట్టుక్కూచున్నాడా లేదా?

కాని ఇవాళనుంచీ పరీక్షల పీడ విరగ డైపోయింది విన్నటితో పరీక్షలయిపోయాయి. ఇక రెండు నెల్లపాటు తాను పంజరం విడిచిన పక్షి!

'ప్రకాశం బియ్యే!'

పాసుకావటం రూఢే. క్లాసు వస్తుందా రాదా అని! ఏమో? రెండు పేపర్లు పాడుచేశాడు. చాలా టఫ్‌గా ఉన్నా యాపేపర్లు. ఆ పేపర్లు సెట్ చేసినవాళ్ళు ఆరోజు పెళ్ళాలతో పోట్లాడి ఉంటారని రాజు నమ్మకం. పేపర్లు సెట్ చేసేవాళ్ళు మునీశ్వరుల్లాటి వాళ్ళుగా ఉండాలనీ, లేదా పిల్లలంటే నెహ్రూలాగా ప్రేమగలిగి ఉండాలనీ, అదీకాకపోతే సబ్జక్టులు వొట్టి మత్తాలై ఉండాలనీ అంటాడు రాజు. వాళ్ళ జన్మ నక్షత్రాలనుబట్టి పులులూ, మొసళ్ళూ, పాములూ తదితర దుష్ట జంతువులూ కాకూడదుట; రాక్షస గణాలకు చెందినవాళ్ళు కారాదుట.

ప్రకాశం ఆలోచించటం మాని ఆలకించాడు. విమానం చప్పుడు. కారవెల్!

చాలామంది కుర్రాళ్ళకు ఇంజన్లు నడపాలనీ, లేకపోతే పోలీసుకావాలనీ ఉంటుందిట. ప్రకాశానికి ఆ రెండు కోరికలూ లేవు గాని, విమానం నడపాలన్న కోరిక మహా వుంది. పైలట్! ఆ మాటే వాడి చెవుల కెంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. సివిలియన్ ఏర్ క్రాఫ్ట్ నడపడంలో విశేషం ఏమీలేదు. వాళ్ళూ ఒక విధంగా ఇంజను డ్రైవర్లే. మిలిటరీ ప్లేన్స్! ఏర్ ఫోర్స్ పైలట్ అయితే చెప్పాలా? ఎక్కడెక్కడికో ఎగిరిపోవచ్చు. యుద్ధం వస్తేకూడా ఏర్‌ఫోర్స్ ఎక్కువ క్షేమం. ఫైటర్ ప్లేనయితే డేంజర్. బాంబరు కడుపు, ఎక్కడెక్కడికో వెళ్ళి బాంబులువేసి తిరిగొచ్చెయ్.

ప్రకాశంహృదయంలో క్రౌర్యం లేదు. అందుచేత, తను బాంబరుపైలట్ అయితే గియితే శత్రువుల నగరాలమీద బాంబులు వెయ్యటానికి తనకు అభ్యంతరం ఉంటుందా అని ఆత్మపరిశోధన చేసుకున్నాడు. ఏమంత ఉండకపోవచ్చు. ఎంచేతనంటే బాంబులవల్ల జరిగే విధ్వంసం పైలట్‌కు వివరంగా కనపడదు. ఒకనాడు రాత్రి ప్రకాశం బొద్దింకలమీద డీ డీ టీ చల్లాడు. మర్నాడు తెల్లవారి లేచి బాత్‌రూంలోకి వెళ్ళేసరికి బొద్దింకలు వెల్లకిలాపడి, కాళ్ళు బల హీనంగా ఆడిస్తూ ఇంకా మరణవేదన పడుతున్నాయి. తెల్లవార్లూ అవి మరణవేదనతో బాధపడుతున్నాయని గ్రహించి వాడు చాలా నొచ్చుకున్నాడు. కాని వాటిని తీసుకుపోయి దూరంగా పారేసి కంటి ఎదుట లేకుండా చేసుకున్నాక, వాడి అంతరాత్మ అతి త్వరలో శాంతించింది.

శవాలను మాయం చెయ్యగలిగితే చాలామంది హంతకు లవుతా రంటాడు రాజు. హత్య చెయ్యటం సమస్యేకాదుట—అసలు సమస్య శవం. అదే చివరకు హంతకుణ్ణి పట్టి ఇచ్చేది. అయితే యుద్ధంలో చచ్చిన వాళ్ళ శవాలు తమ హంతకులను పట్టివ్వలేవు. అదేదో సినిమాలో ఇద్దరు హంతకులు ఒకరు చెయ్యవలిసిన హత్య మరొకరు చేస్తారు. అప్పుడు శవాల ఆట కట్టవుతుంది. యుద్ధంలో కూడా అంతే. ఫలాని వాడు ఫలాని వాళ్ళను హత్య చెయ్యాలీ అని ఉండదు గనక చచ్చిన వాళ్ళు చంపినవాళ్ళని వేలుపెట్టి చూపలేరు.

రాజు మంచి డిటెక్టివ్ కథకు డవుతాడు. మామూలుగా వచ్చే పాకెట్ పుస్తకాలలో వాడు చూపించే తప్పులు అన్నీ ఇన్నీ కావు. వాడే పాకెట్ పుస్తకాలు రాస్తే మహా పకడ్బందుగా ఉంటాయన్న మాటే. వాడికేం? బంగారు పిచ్చుక. వాళ్ళనాన్న గుడ్స్‌షెడ్‌లో గుమాస్తాచేసి అంతులేని డబ్బు కూడబెట్టాడు. బియ్యేలో క్లాసు వస్తుందా రాదా అన్న విచారం వాడికిలేదు. ఇంకో నెల్లో వాడికి పెళ్ళి కాబోతున్నది - యాభై వేల కట్నంతో.

'యాభై వేలు!....నాకు అయిదువేలిచ్చే దాత లేడుకదా! ఇద్దరమూ చిన్నతనంనుంచీ ఒకటిగా తిరుగుతున్నాం. ఎందులోనూ

వాడు నన్ను మించడు. కాని నేను కింది అంతస్తులోనే ఉన్నాను. వాడు లిఫ్టుమీద తుర్రున యాభయ్యో అంతస్తుకు వెళ్ళిపోయాడు.'

'బియ్యే పాసయాక ఎమ్మే చదువుతావుట్రా?' అని ప్రకాశం అడిగాడు రాజును.

'నువు చదివితే కంపెనీకోసం చదువుతాను,' అన్నాడు రాజు.

కాని నాన్న చదివించడు. 'నువు క్లాసు తెచ్చుకో. దాని ఆధారంతో కట్నం తెచ్చుకో. అదిపెట్టి అమెరికావెళ్ళి చదువుకున్నా నా కభ్యంతరం లేదు. నేనుమాత్రం ఇక నీ చదువుకింద నయా పైసా ఖర్చు చెయ్యను.' అని నాన్న ఖచ్చితంగా చెప్పేశాడు.

డిస్టింక్షన్ వస్తేమాత్రం బియ్యేల కీరోజుల్లో కట్నాలెవ రిస్తారు? కట్నం సంపాదించాలంటే ఇంజనీరో, డాక్టరో కావాలి. తనకు రెండూ సున్నాయే.

కాకపోయినా తను ఎట్లా పెళ్ళిచేసుకుంటాడు? నిర్మలను చేసుకోలేకపోతే బ్రహ్మచారిగా ఉంటానని ఏనాడో తను ఘోర ప్రతిజ్ఞ చేశాడు.

రాజు చెల్లెలు నిర్మల. మేకప్ చేసుకున్న సినిమా స్టారులా గుంటుంది. నిర్మల చిన్నగా నవ్వినప్పుడల్లా ప్రకాశం నరాలు లాక్కు పోతాయి. దుర్భరమైన బాధ కలుగుతుంది. వారానికొకసారైనా నిర్మల కల్లోకొస్తుంది.

తనకు నిర్మల కల్లోకొచ్చినప్పుడల్లా నిర్మలకు తానుకూడా కల్లోకొస్తానని ప్రకాశానికి గట్టి నమ్మకం. అంత స్పష్టమైన కలలు వట్టి భ్రమ ఎట్లా అవుతాయి? అసంభవం.

ఒకసారి, నిర్మల తన కలలోకి వచ్చిన మర్నాడు, ప్రకాశం నిర్మలను అడిగాడు, 'నీకు రాత్రి ఏమైనా కల వచ్చిందా?' అని.

'ఏదో వచ్చిందిగాని, నిద్రలేచాక జ్ఞాపకంలేదు.' అన్నది నిర్మల.

మరోసారికూడా ప్రకాశం అదేప్రశ్న వేస్తే, 'అమ్మయ్యో, రాత్రంతా నాకు కల్లో దొంగలే!' అన్నది నిర్మల, అది జ్ఞాపకం చేసుకుంటేనే కంపరం పుట్టినట్టుగా.

'డామిట్, కథ అడ్డం తిరిగింది.' అనుకున్నాడు ప్రకాశం.

అసలీకథ మొదటినుంచీ అడ్డంతిరిగే ఉన్నది. డాక్టరన్నట్టు రిట్రావర్షన్ కేసు. గర్భధారణ జరగదు.

నిర్మలను ఏ ఐ. యే. యస్. ఫారిన్ రిటర్న్డ్‌వాడో వచ్చి ఎత్తుకుపోతాడు. రుక్మిణీ కల్యాణంలో శిశుపాలుడిలాగా అవుతుంది తనగతి. రాజు కనీసం రుక్మి పాత్ర ధరించి తన ప్రధాన శత్రువుతో పోరాడుతా డనికూడా నమ్మకంలేదు.

ఛప్! రుక్మిణీ కల్యాణం బాగాలేదు. సుభద్రా పరిణయం బాగుంటుంది. తాను అర్జునుడు. నిర్మల సుభద్ర. రాజు కృష్ణుడు. నిర్మలను రాజాధిరాజు కొడుక్కి ఇవ్వటానికి ప్రయత్నాలు జరుగుతాయి. కాని రాజు తనపక్షాన పనిచేసి. ఇంటిల్లిపాదినీ బ్రహ్మోత్సవానికి - అంటే, ఈ సందర్భంలో సినిమాకి - పట్టుకెళ్ళిపోతాడు. తలనొప్పి వంకపెట్టి నిర్మల ఇంట్లో ఉండిపోతుంది. అప్పుడు తాను వెళ్ళి నిర్మలను ఎత్తుకు పోతాడు.

సినాప్సిస్ బాగానే ఉంది గాని సినేరియో కొన్ని చిక్కులు తెచ్చి పెడుతుందేమో!

మొదటి సంగతి ; రాజు కృష్ణవేషం కట్టటానికి ఒప్పుకోవాలి.

రెండో సంగతి : 'తలచునో, తలపడోగాని తనదు మేనమామ సుతను,' అన్న పాట పాడటానికి నిర్మల ఒప్పుకోవాలి. అనగా ఆమె తనను ప్రేమించటానికీ, పెళ్లాడటానికీ మాత్రమేగాక, తనవాళ్ళమీద తిరుగుబాటు చెయ్యటానికీ, తనతో లేచిరావటానికీ కూడా సిద్ధంగా ఉండాలి.

మూడో సంగతి : ద్వారకనుంచి ఇంద్రప్రస్థానికి పారిపోవటం సాధ్యంకాని కొవ్వూరునుంచి కొవ్వూరికి పారిపోవటం యెలా సాధ్యపడుతుందీ? ఇద్దరిదీ ఒక ఊరే అయి ఏడిచిందే!

ఏ బొంబాయో, శ్రీనగరో పారిపోవచ్చు కాని తన దగ్గిర రాజమండ్రీ వెళ్ళటానిక్కూడా డబ్బులుండి చావవుగదా!

నాలుగో సంగతి : డబ్బు!

తనకు శ్రీనగరు వెళ్ళి, దాల్‌లేక్ మీద నౌకా విహారాలు చేసే శ్రోమతుంటే మహారాజులా, పబ్లిగ్గా నిర్మలను పెళ్ళాడే పనేగదా!

డామిట్. డబ్బు పాయింటుమీదనే కథంతా అడ్డం తిరిగింది!

అయినా ప్రకాశానికి ఆశ చావలేదు. అదే పగటికలలు కనేవాడిలో ఉండే విశేషం.

ఈ సుభద్రా పరిణయానికి కీలక పాత్ర కృష్ణుడు. అంటే ఈ సందర్భంలో రాజు. స్ట్రాటజీ, టాక్టిక్సూ రాజుకే వదిలేయాలి. తన ఇలోప్‌మెంటు అర్జునుడే ప్లాన్ చేసి ఉంటే అంతా అభాసై ఉండును. సుభద్ర దుర్యోధనుడి పెళ్ళాం అయిపోయి ఉండును.

రాజు హెల్ప్‌ఫుల్ ఫెలో. తప్పక హెల్ప్ చేస్తాడు.

రాజును సలహా అడగాలి.

ఎలా అడగటం? సబ్జెక్టు ఎలా ప్రోచ్ చెయ్యాలి!

'ఒరే, రాజూ, చాలా కాలమై నీతో ఓ మాట చెబుదా మనుకుంటున్నాను. నువ్వేమీ అనుకోనని ఒట్టేస్తే చెప్పేస్తాను. నా మైండ్‌లో ఓ ప్రాజెక్టు ఉంది. అది బియాండ్‌మీ అని నాకు తెలుసు. కాని నీలాంటి ఆల్ పవర్‌ఫుల్, ఎక్‌స్ట్రీమ్లీ హెల్ప్‌ఫుల్ ఫ్రండ్ అండగా ఉండటంచేత సాహసించి ఓ ఆలోచన చేశాను. వాయ్‌మీసీజ్, ఈజ్ దేర్ ది స్లైటెస్ట్, ది ఫేయింటెస్ట్ పాసిబిలిటీ ఆఫ్ మై టేకింగ్ ది హాండాఫ్ యువర్ సిస్టర్ ఎటాల్? ఎందుకడుగుతున్నా నంటే నేను నిర్మలను ఘోరంగా ప్రేమిస్తున్నాను—లైక్ హెల్, ఐనో! నేనామెకు డిజర్వుకాను. కాని లవ్ ఉంది చూడూ—అది గ్రేట్ లెవెలర్! బుల్‌డోజర్ లాగా అది మిట్టపల్లాలన్నిటిని లెవ లప్ చేస్తుంది. ప్రపంచానికి ఇంకా లవ్‌లో ఫేత్ లేదు. అందుకే వాళ్ళు మిట్టపల్లాలకు అన్‌డ్యూ ఎటెన్షన్ పే చేస్తారు. వాటిని సరి చేస్తామని మనబోటివాళ్ళు అన్నాకూడా, అలా ఎంత మాత్రం వీల్లేదనే అంటారు. మనం గుడ్‌వర్క్ ఎక్కడోక్కడ బిగిన్ చెయ్యాలి గనక హవెబవుట్ హెల్పింగ్ మీ?'

ఈ ధోరణిలో రిక్వెస్టు చేస్తే రాజు ఒబ్లయిజ్ చెయ్యక పోతాడా?....

'ఇంకా నిద్దరేమిట్రా?' అని లేపేసింది తల్లి.

ప్రకాశం, సుభద్ర రాగానే, దొంగజపం చాలించిన అర్జునుడి లాగా అయిపోయి, చివాల్న మంచంమీదినుంచి లేచాడు. బాత్ రూంలోకి వెళ్ళి మొఖం కడుక్కుని షేవ్‌చేసుకుని, అద్దంలో చూసు కుంటూ, 'హాండ్సమ్ ఫేస్! ఈ ముఖాన్ని ఎడ్వర్టయిజుమెంటులో లాగా నిర్మల నిమిరి పారవశ్యంచెందే ప్రాప్తం వుందా, లేదా?' అనుకున్నాడు.

ప్రకాశం కాఫీ కప్పు నోటికి ఎత్తుకోబోతుండగా గుడ్ ఓమన్ లాగా రాజు వచ్చాడు.

'అమ్మా, రాజుకు కప్పు కాఫీ!' అని కేకేశాడు ప్రకాశం.

'గుడ్ న్యూస్‌రా, ప్రకాష్! నిన్న నిర్మలకు సంబంధం కుదిరింది. ఎక్సెలెంట్ మాచ్! ఐ. ఏ. ఎస్. గా రీసెంట్‌గా సెలెక్టయాడు. ఎక్సెలెంట్ పర్సనాలిటీ!—'

ప్రకాశానికి కాఫీ కొరబోయింది. దగ్గు తెరలో రాజు చెప్పే దేదీ వినిపించలేదు.